క్లుప్తంగా

ఎంపీటీసీ వెలుగొండయ్యకు పరామర్శ



వెలుగొండయ్యను పరామర్శిస్తున్న అన్నా

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు ఎంపీటీసీ చక్కెర వెలుగొండయ్యను వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు శనివారం పరామర్శించారు. వెలుగొండయ్య ఇటీవల ఆరోగ్యం బాగాలేక ఒంగోలు వైద్యశాలలో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వెలుగొండయ్యను అన్నా పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అన్నాతో పాటు ఎంపీపీ ఎం మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, గాడి కోనేటిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చిరుగూరి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు గుండు ఎత్తు పందెం

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం గుండు ఎత్తు పందేలు ఏర్పాటు చేస్తున్నట్లుగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య శనివారం తెలిపారు. గుండు ఎత్తు పందెంలో పాల్గొనాలనుకునేవారు ఆదివారం 2 గంటల్లోపు రూ.150 ప్రవేశ రుసుం చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుతిగా 10 తులాల వెండి, రెండో బహుమతిగా 5 తులాల వెండిని బహూకరిస్తున్నట్లుగా తెలిపారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 11, 12 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 21వ తేదీవరకు ప్రభుత్వం పొడిగించినట్లు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అన్నారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. మిగతా తరగతులకు సంబంధించి ఖాళీలను బట్టి దరఖాస్తులకు అనుమతి ఇస్తామన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. వివరాలకు 85007 23716, 88977 10857 నంబర్‌లను సంప్రదించాలని సురేఖ సూచించారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం



అవార్డు అందుకున్న మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ కంటి వైద్యుడు జీకే మోహన్‌రెడ్డికి చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో సైకాలజీ విభాగంలో డాక్టరేట్ అవార్డు పొందిన సందర్భంగా పట్టణంలోని టెన్నిస్ స్టేడియం ఆవరణలో శనివారం క్రీడాకారులు సన్మానం చేశారు. డాక్టరేట్ అవార్డు గ్రహీత డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి 'పర్సనాలిటీ ఫ్యాక్టర్స్ అడ్జస్ట్మెంట్ అండ్ లోకస్ ఆఫ్ కంట్రోల్ యమాంగ్ ది విజువల్లి ఇంపైర్డ్ చిల్డ్రన్' అనే అంశంపై అవార్డును పొందడం చాలా గర్వంగా ఉందని గిద్దలూరు లాన్ టెన్నిస్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ సీహెచ్ రంగారెడ్డి అన్నారు. కార్యక్రమంలో టెన్నిస్ లాన్ నిర్వాహకులు త్రిమూర్తిరెడ్డి, మురళిరెడ్డి, టపావలి, కోటయ్యగౌడ్,డా. సందీప్, డా.సుదర్శన్‌రెడ్డి, సతీష్, మహేష్‌కుమార్, రంగయ్య, అబ్దుల్లా, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకశాంతి కోరుతూ గాయత్రి యజ్ఞం



గిద్దలూరు రూరల్: పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కాశినాయన నగర్‌లో గల గాయత్రి మాత ఆలయం ఆవరణలో శనివారం గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో లోకశాంతి కోరుతూ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి పరివార్ నిర్వాహకులు పీ హనుమంతారెడ్డి మాట్లాడుతూ గాయత్రి యజ్ఞం వల్ల సకల శుభాలు సంతరించుకుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చుకుని జీవితాన్ని ఎంతో ఆనందమయంగా మార్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా గాయత్రిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ నారాయణ రెడ్డి, సభ్యులు అంజనీకుమార్, వీరారెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

పొగాకు వేలంలో.. సమస్యల తాళం!

- అమ్ముడుపోని బేళ్లతో రైతుల్లో ఆందోళన
- మండుతున్న ఎండలతో తగ్గుతున్న తూకం
- తిరస్కరణ బేళ్లు తిరిగి తేవాలంటే అధిక ఖర్చులు
- అదనపు భారమని రైతుల ఆవేదన



అమ్ముడుపోని బేళ్లను ట్రాక్టర్‌లలో ఎక్కిస్తున్న రైతులు

పొదిలి:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగం కుదేలైంది. వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలు, పశుపోషణ తదితర రంగాలు అన్నీ కుంటుపడిపోయాయి. అటు ఖరీఫ్, ఇటు రబీ సీజన్‌లలో పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు రైతన్నలు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చాక పంగనామాలు పెట్టింది. దీంతో రైతన్నలు అప్పులకు తెచ్చి పెట్టుబడి పెట్టారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు నెలకొన్నాయి.

పొగాకు రైతుల కష్టాలు చెప్పలేనివి..


మండలంలో ఆశా జనకంగా ప్రారంభమైన పొగాకు తీరా వేలానికి వచ్చేసరికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వేలం తీరులో జరిగే మార్పులు రైతుల్లో ఆందోళన పెంచుతుంది. ధరలు ఎలా ఉంటాయోనన్న టెన్షన్‌తో పాటు, రిటన్ బేళ్ల రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. మండుతున్న ఎండల్లో బేళ్ల వేలం కేంద్రానికి మళ్లీ మళ్లీ తీసుకరావాలంటే రైతులు ప్రయాసాలకు గురవుతున్నారు. పొగాకు తూకం తగ్గటంతో పాటు, నాణ్యత కూడా తగ్గిపోతుంది. వేలం కేంద్రంలో 10,900 బేళ్లు రైతులు వేలంలో ఉంచారు. వాటిలో 7,994 బేళ్లు మాత్రమే అమ్మకాలు జరిగాయి. ఈ నెల 9వ తేదీన బుధవారం ఒక్క రోజున 829 బేళ్లను రైతులు వేలంలో ఉంచారు. వాటిలో 344 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. రైతులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా నిల్వ చేద్దామంటే వీలు కావడం లేదు. కొంతమంది రైతులు చెక్కుకు రోజుకు రూ.10 చొప్పున అద్దె చెల్లిస్తూ వేలం కేంద్రం సమీపంలో నిల్వ చేసుకుంటున్నారు. ఎక్కువ మంది రైతులు బేళ్లను ఇళ్లకు తీసుకువెళ్తున్నారు. వేలం కేంద్రానికి వచ్చిన మొత్తం బేళ్లలో సుమారు 25 శాతం బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి.

రిటర్న్ బేళ్ల పరిస్థితి ఇలా..

మొత్తం వేలానికి ఉంచిన బేళ్లు	10,900
విక్రయించినవి	7,994
వెనక్కు పంపినవి	2663
అమ్ముడుపోనివి	85
నో బిడ్	1,531
రైతు రిజెక్షన్	453
కంపెనీ తిరస్కరించినవి	593
జంపింగ్ బేళ్లు	243

వ్యాపారులు ఎఫ్ 1, ఎఫ్ 2 రకాల కొనుగోళ్లకు మొగ్గు చూపుతుండటంతో ఈపరిస్థితి ఏర్పడింది. సుమారు 30 శాతం మేర ఈ రెండు రకాలు ఉండటంతో, మిగిలిన బేళ్ల పరిస్థితి ఎలా ఉంటుందోననే బెంగ రైతులకు ఉంది.

రైతులకు మేలు చేయాలి..



పొగాకు బేళ్ల రిటన్ తీసుకవెళ్లాల్సి రావడం రైతులకు అన్ని విధాలుగా నష్టదాయకం. రవాణా చార్జీలతో పాటు, బేళ్లు తిరిగి ఏర్పాటు చేయడం, అటు ఇటు తిప్పటంతో తూకాలు తగ్గటంతో పాటు మండుతున్న ఎండలు నాణ్యతపై కూడా ప్రభావం చూపుతాయి. బోర్డు అధికారులు తగు చర్యలు తీసుకుని రైతులకు మేలు చేయాలి.

– తిరుమలరెడ్డి నాగిరెడ్డి,చెర్లోపల్లి

సగటు ధరలు పడిపోకుండా చూడాలి..



సగటు ధరలు పడిపోకుండా చూడటంతో పాటు, రిటన్ బేళ్ల సంఖ్యను క్రమేపి తగ్గించాలి. రైతు నాలుగు బేళ్లు తెస్తే, వాటిలో ఒకటి కొనుగోలు చేసి, మూడు తిరస్కరిస్తే మేలు జరగదు. వేసవి కాలంలో బేళ్లు మళ్లీమళ్లీ ఏర్పాటు చేయాలంటే ఆకు నలిగిపోయే ప్రమాదం ఉంది. రవాణా చార్జీలు కూడా అధికంగా ఉంటున్నాయి.

– బీరం కృష్ణారెడ్డి, గురుగుపాడు

రిటన్ బేళ్ళు తగ్గుతాయి..



వ్యాపారులు తక్కువగా ఉండటం, వారు కూడా గ్రేడ్ పొగాకు కొనుగోలు వైపు మొగ్గు చూస్తుంటంతో రిటన్ బేళ్ల సంఖ్య పెరిగిన మాట వాస్తవమే. అయితే త్వరలో కర్ణాటక పొగాకు వేలం ముగుస్తున్న దృష్ట్యా, ఇక్కడ కొనుగోళ్లు మరింత ఊపందుకుంటాయి. దీంతో రిటన్ బేళ్ల సంఖ్య తగ్గిపోతుంది. రైతులు కూడా మంచి బేళ్లను వేలంలో ఉంచేలా చూసుకోవాలి.

– గిరిరాజ్‌కుమార్, వేలం అధికారి

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు



కె.భువర్షిణి, కొమరోలు



మేఖల నిఖిల్, బేస్తవారిపేట



త్రిలోకేశ్వరి (బైపీసీ 990)



టి. మేరి (బైపీసీ, 989)



టీ రోషిణి (ఎంపీసీ 987)

కంభం: ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో కంభం విద్యార్థులు సత్తాచాటారు. ప్రభుత్వజూనియర్ కళాశాల్లో ఎంపీసిలో బడిపాటి ఎలీషాబాబు 961 మార్కులు, బైపీసీలో సట్టీ అనిల్ 947, ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో కాకుమాని తిరుపతమ్మ 432, హెచ్‌ఈసీలో లక్కు రాజేష్ 447 మార్కులు సాధించారు. ఎంపీసిలో లాస్యరెడ్డి 463, కె. శ్రీనితరెడ్డి 460, షేక్ వాసముహిషిన్ 460, బైపీసీలో పీవీ రంగ మధుప్రియ 433, డీ స్వాతి 431 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు. తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసిలో సీహెచ్ కృపశాంతి 945, బైపీసీలో డీమహిత 895 మార్కులు సాధించింది. విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ఐఓ సైమన్ విక్టర్ అభినందించారు.

కొమరోలులో..

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభ కనపరిచినట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్ తెలిపారు. ఎంపీసీలో కె.భువర్షిణి 453 మార్కులు, బైపీసీలో కె.తవిత 949 మార్కులు సాధించినట్లు మండలస్థాయిలో ద్వితీయ స్థానంల నిలిచినట్లుగా తెలిపారు. అలాగే స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో ఎంపీసీ ఎం.ధరణి కుమార్ 965, బైపీసీలో కొప్పుల శిరీష 960 మార్కులు సాధించిన మండలస్థాయి ప్రథమ స్థానంలో నిలిచింది. బైపీసీలో పఠాన్ నఫియాభాను 415 మార్కులు సాధించి మండలస్థాయి ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల డైరెక్టర్లు క్రిష్టారెడ్డి, సందీప్ రెడ్డి తెలిపారు.

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ప్లస్ విద్యార్థి మేకల నిఖిల్ ఎంపీసీలో 419 సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎంఎస్ శర్మ తెలిపారు.

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, గొట్లగట్టు కేజీబీవీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. వెలుగొండ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 44 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 21 మంది పాసయ్యారు. సెకండియర్‌లో 32 మందికి 24 మంది పాసైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. గొట్లగట్టు కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలకు సంబంధించి ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 14 మందికి 8 మంది పాసయ్యారు.సెకండ్ ఇయర్‌లో 14 మందికి 8 పాసైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ తెలిపారు.

మార్కాపురంలో విద్యార్థుల ప్రతిభ..

మార్కాపురం టౌన్: ఇంటర్ పరక్షా ఫలితాలలో మార్కాపురానికి చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటారు. శ్రీసాధన కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో డి.హమ్నాపరహత్ 465, ఎస్‌డీ యాస్మిన్ 465, మారంరెడ్డి భవానీ 464, అలాగే బైపీసీ విభాగంలో ఎం.సత్యరజిత 436, పీ.ఉషాశ్రీ 428, షేక్ ఉర్నా 425, షేక్ ఆశా 421మార్కులు సాధించారని తెలిపారు. ఎంఈసీ విభాగంలో ఆర్ ప్రణీత్ తేజశ్వర్ 479, సీఈసీ విభాగంలో బి.జ్యోత్స్నబాయి 457 మార్కులు సాధించారు. రెండో సంవత్సరం పరీక్షా ఫలితాలలో ఎంపీసీ విభాగంలో బీ.గోవర్ధిని 988, కె. మల్లేశ్వరి 986, షేక్ హుస్నేనూబాషా 986, సీహెచ్ యష్మశ్రీ 985 మార్కులను సాధించారు. అలాగే బైపీసీ విభాగంలో పీ.నవ్యశ్రీ 983, కె.చైతన్య 977, ఎస్.ప్రేమ్‌శ్రీరెడ్డి 972 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో ఎ.నాగసాయి 974 , సీఈసీ విభాగంలో ఎం.భావనారెడ్డి 953మార్కులను సాధించారు. అత్యంత ప్రతిభను కనబరిచిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్‌లు ఎం.కృష్ణారెడ్డి, వీఆర్‌కె ప్రసాద్, డి.రాజగోపాల్‌రెడ్డి, జీఎల్ రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ప్రైవేటు.. విద్యార్థులు హవా

కంభం: గౌతమ్ జూనియర్ కళాశాలలో బైపిసిలో ఎంవీ త్రిలోకేశ్వరి 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం, టి మేరీ 989 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచినట్లు కరస్పాండెంట్ చేగిరెడ్డి భూపాల్‌రెడ్డి తెలిపారు. వాసవీ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పి. రోషిణి 987 మార్కులు, ఎస్ చిరన్మయి 985 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్‌లు ప్రసాద్, రమేష్‌బాబు

వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి



ప్రదర్శనలో పాల్గొన్న సీపీఐ, ఎంపీజే నాయకులు

మార్కాపురం టౌన్: దేశంలో కోట్లాది మంది ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ, ఎంపీజే పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శనివారం మార్కాపురం పట్టణంలో సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం మొదటి నుంచి ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు పరచటంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ముందు ఉన్నదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై అందరూ ఉద్యమించాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెద్దన్న, షేక్ కాశిం, పార్టీ నాయకులు కాశయ్య, శేఖర్, రసూల్, కరిముల్లా, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న అన్నా రాంబాబు, నాయకులు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

మార్కాపురం: చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు సెంటర్‌లో షంషేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత మంచి నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ షమీర్ ఆలీ బేగ్ సేవలు అభినందనీయమన్నారు. ఆలీ బేగ్ ట్రస్ట్ ద్వారా కొన్ని ఏళ్లుగా ప్రతి ఏటా వేసవిలో మంచి నీటి చలివేంద్రం, అంబులెన్స్ సేవలు, పేద విద్యార్థులకు రాయితీ లాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం సంతోషమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తానని ఈ సందర్భంగా షంషేర్ ఆలీబేగ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సెక్రటరీ మేడం బద్రీనాథ్ మాట్లాడుతూ ఆలీ బేగ్ సేవలు స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ ఉస్మాన్ బేగ్ , మున్సిపల్ వైఎస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ , రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, కౌన్సిలర్ డాక్టర్ సీహెచ్ కనక దుర్గ, ఎఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, నాయకులు డాక్టర్ మగ్బుల్ బాషా, రిటైర్డ్ వార్డెన్ నజీర్ అహ్మద్, లయోలా చెంచిరెడ్డి, బొగ్గరపు శేషయ్య, బచ్చు జనార్దన్, ఉత్తమ్ కుమార్, సతీష్ , పరతుల్లా బేగ్ , ఉస్మాన్, ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి మహాపచారం



ఆలస్యంగా స్వామివారి నగరోత్సవం చేస్తున్న అర్చకులు

- అర్చకుల మధ్య వివాదం
- 10 గంటల పాటు ఆలస్యంగా జరిగిన అంకురార్పణ

మార్కాపురం టౌన్: లక్షలాది మంది భక్తుల ఇలవేల్పైన శ్రీదేవీ,భూదేవీ సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి మహాపచారం జరిగింది. ఆలయంలో పనిచేసే అర్చకుల మధ్య జరిగిన వివాదంతో స్వామివారికి శుక్రవారం రాత్రి జరగాల్సిన అంకురార్పణ ఆగిపోయి శనివారం ఉదయం 8 గంటల సమయంలో జరిగింది. దీనితో భక్తుల మనోభావాలు దెబ్బతిని అర్చకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉదంతం దేవదాయశాఖ ఉన్నతాధి కారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి ప్రారంభమై 29వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి 9 గంటలకు అంకురార్పణతో ఉత్సవాలను ప్రారంభం కావాలి. అయితే శుక్రవారం రాత్రి 8 గంటలకే ఉభయదాతలు పూజా సామగ్రితో ఆలయానికి వచ్చారు. ఆలయంలో పనిచేసే అర్చకుల మధ్య విభేదాలు తలెత్తి వాగ్వివాదానికి దారితీశాయి. దీనితో అంకురార్పణ కార్యక్రమం జరగలేదు. తెల్లవార్లు అర్చకుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ విషయం ఉదయం 5 గంటలకు స్వామివారి భక్తులకు సోషల్ మీడియా వేదికగా తెలిసింది. దీనితో పలువురు భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అర్చకుల మధ్య జరిగిన వివాదం ఈఓ శ్రీనివాసరెడ్డి దృష్టికి వెళ్లింది. దీనితో ఆయన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్చకులతో మాట్లాడి అంకురార్పణ పూజలు చేయించారు. అనంతరం స్వామివారి నగరోత్సవం నిర్వహించారు. కాగా ఈ వివాదం సోషల్ మీడియాలో ట్రోల్ అయింది. అంకురార్పణ రోజే ఇలా జరగడం పట్ల పలువురు భక్తులు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



అన్నా రాంబాబు, షంషేర్ అలీబేగ్‌ను సన్మానిస్తున్న భద్రీనాథ్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని.. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను లక్ష్యాలను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. మార్కాపురం పట్టణానికి చెందిన ఎంఎస్ ఎంఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేడా భద్రీనాథ్‌ను ఇటీవల పార్టీ మేధావుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన సందర్భంగా భద్రీనాథ్ శనివారం పట్టణంలోని జవహర్ కాలనీలోని అన్నా రాంబాబు నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్నాను, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ అలీ బేగ్‌ను సన్మానించారు. మండలంలోని నిఖరం పల్లి గ్రామంలో సీతారామచంద్ర స్వామి వారి తృతీయ వార్షికోత్సవ మహోత్సవంలో రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.